www.aksharadarbar.com

శుక్రవారం 18, అక్టోబర్ 2024

# అక్షర దర్బార్

voice of the people

తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :216 | పేజీలు : 04 | వెల : 05

## సారొచ్చారు

- కాకతీయ విశ్వవిద్యాలయం
- వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి
- తొమ్మిది యూనివర్సిటీలకు వీసీల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

02

# చిచ్చు..

ఛాన్స్ కోసం పార్టీ శ్రేణుల పోటాపోటీ..

## కాంగ్రెస్‌లో కాకరేపుతున్న ఇందిరమ్మ కమిటీలు

కాంగ్రెస్ పార్టీలో ఇందిరమ్మ కమిటీలు కాక పుట్టిస్తున్నాయి. పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయ లోపంతో అసంతృప్తి జ్వాలలు రాజుకుంటున్నాయి. తమకు ప్రాధాన్యత దక్కడంలేదని సీనియర్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగానే తమ అసంతృప్తిని వెల్లగక్కుతున్నారు. ఏకంగా ఎమ్మెల్యేలపైనే ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో పార్టీలో లుకలుకలు రచ్చకెక్కాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ మెజార్టీ చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. పార్టీకి కష్టకాలంలో సేవలందిస్తూ వచ్చిన తమను కాదని కొత్త వారికి ఛాన్స్ ఇస్తే ఊరుకునేది లేదంటూ సీనియర్ కార్యకర్తలు తేల్చిచెబుతున్నారు. దీంతో కమిటీల కూర్పు నేతలకు తలనొప్పిగా మారుతోంది. కమిటీలను ప్రకటించిన తర్వాతా కలకలం చెలరేగే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. ఈనేపథ్యంలోనే ఇందిరమ్మ కమిటీల ప్రభావం రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

- అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

- పాత, కొత్త నాయకుల మధ్య కొత్త పంచాయితీ..
- తమకు ప్రాధాన్యత దక్కడంలేదని సీనియర్ కార్యకర్తలు ఆగ్రహం
- మహబూబాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో రచ్చకెక్కిన విభేదాలు
- ఎమ్మెల్యేలపైనే బహిరంగ ఆరోపణలు
- మిగిలిన చాలా చోట్ల ఇదే పరిస్థితి
- కమిటీల కూర్పుపై తలలు పట్టుకుంటున్న నేతలు
- రాబోయే స్థానిక ఎన్నికలపై ప్రభావం చూపుతుందని ఆందోళ..

02



## వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- సుబేదారి రెవెన్యూ కాలనీలో ఇల్లు అద్దెకు..
- ఇతర రాష్ట్రాల మహిళలతో రహస్యంగా వ్యవహారం
- టాస్క్‌ఫోర్స్, సుబేదారి పోలీసుల దాడి
- నిర్వాహకురాలితో పాటు ఇద్దరు విటుల అరెస్ట్

03

## లైన్ క్లియర్

- రైల్వే బైపాస్ లైన్‌కు నోటిఫికేషన్ జారీ..
- నష్కల్ - హసన్‌పర్తి రైల్వే ట్రాక్ ఏర్పాటులో కీలక ముందడుగు
- భూసేకరణకు సంబంధించి అంచనాలు రూపొందించాలంటూ
- రెవెన్యూ అధికారులకు ఆదేశాలు
- 24.5.5 కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నాలు

04

## గ్రూప్ 1 అభ్యర్థులకు బిగ్ షాక్..

- మెయిన్స్ పరీక్షకు డివిజన్ బెంచ్ గ్రీన్ సిగ్నల్
- అభ్యర్థుల రిట్ అప్పీల్ కొట్టివేత..
- 21వ తేదీ నుంచి 27 వరకు ఎగ్జామ్స్..
- రాష్ట్రవ్యాప్తంగా 46 పరీక్షా కేంద్రాలు.. 31,383 మంది అభ్యర్థులు

04

## పెట్రోల్ పోసుకొని ఒంటికి నిప్పు..

- పాలకుర్తి ఠాణాలో యువకుడి ఆత్మహత్యాయత్నం
- కాపాడబోయిన ఎస్సై, కానిస్టేబుల్‌కు గాయాలు

03

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

# కాంగ్రెస్ పార్టీలో చిచ్చు..

## అధికార పార్టీలో కాక రేపుతున్న ఇందిరమ్మ కమిటీలు

- ఛాన్స్ కోసం పార్టీ శ్రేణుల పోటాపోటీ..
- పాత, కొత్త నాయకుల మధ్య కొత్త పంచాయితీ..
- తమకు ప్రాధాన్యత దక్కడంలేదని సీనియర్ కార్యకర్తలు ఆగ్రహం
- మహబూబాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో రచ్చకెక్కిన విభేదాలు
- ఎమ్మెల్యేలపైనే బహిరంగ ఆరోపణలు
- మిగిలిన చాలా చోట్ల ఇదే పరిస్థితి
- కమిటీల కూర్పుపై తలలు పట్టుకుంటున్న నేతలు
- రాబోయే స్థానిక ఎన్నికలపై ప్రభావం చూపుతుందని ఆందోళన..

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీలో ఇందిరమ్మ కమిటీలు కాక పుట్టిస్తున్నాయి. పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయ లోపంతో అసంతృప్తి జ్వాలలు రాజుకుంటున్నాయి. తమకు ప్రాధాన్యత దక్కడంలేదని సీనియర్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బహిరంగంగానే తమ అసంతృప్తిని వెల్లగక్కుతున్నారు. ఏకంగా ఎమ్మెల్యేలపైనే ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో పార్టీలో లుకలుకలు రచ్చకెక్కాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ మెజార్టీ చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. పార్టీకి కష్టకాలంలో సేవలందిస్తూ వచ్చిన తమను కాదని కొత్త వారికి ఛాన్స్ ఇస్తే ఊరుకునేది లేదంటూ సీనియర్ కార్యకర్తలు తేల్చిచెబుతున్నారు. దీంతో కమిటీల కూర్పు నేతలకు తలనొప్పిగా మారుతోంది. కమిటీలను ప్రకటించిన తర్వాతా కలకలం చెలరేగే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. ఈనేపథ్యంలోనే ఇందిరమ్మ కమిటీల ప్రభావం రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

### సీనియర్ల ఆవేదన..

ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారుల ఎంపిక బాధ్యతలను ప్రభుత్వం కమిటీలకు అప్పగించింది. ఏడుగురు ప్రతినిధులతో కూడిన కమిటీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించి ఆమేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. మున్సిపల్ ప్రాంతాల్లో కార్పొరేటర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కన్వీనర్‌గా డివిజన్ అధికారిని ఒకరిని నియమించాల్సి ఉంటుంది. అదేవిధంగా గ్రామస్థాయిలో సర్పంచ్ లేదా గ్రామ స్థాయి నాయకుడు చైర్మన్‌గా పంచాయితీ సెక్రటరీ లేదా స్పెషల్ ఆఫీసర్ కన్వీనర్‌గా కమిటీలో ఎస్సీ లేదా ఎస్టీ నుంచి ఒకరు, బీసీ నుంచి ఒకరు ఖచ్చితంగా సభ్యులుగా ఉండాలి. ఇద్దరు మహిళా గ్రూపుల నుంచి, మరొకరు జనరల్ కేటగిరీ నుంచి ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఈ కమిటీలు ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులను ఎంపిక చేయడమే కాకుండా. సామాజిక తనిఖీలు కూడా నిర్వహించేందుకు అధికారం కలిగి ఉంటాయి. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక, ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయడంలో కీలకపాత్ర కమిటీలదే కావడంతో కమిటీల్లో చోటు దక్కించుకునేందుకు ఎవరికి వారుగా కాంగ్రెస్ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ కార్యకర్తలతోపాటు పార్టీలో కొత్తగా చేరిన వారు సైతం పోటీపడుతున్నారు. కష్టకాలంలో పార్టీకోసం పనిచేసిన తమను కాదని కొత్తగా చేరిన వారికి చోటు కల్పిస్తే ఊరుకునేదిలేదని సీనియర్లు తెగేసి చెబుతున్నారు. గ్రామస్థాయి నుంచి పట్టణాల దాకా ఇదే పరిస్థితి నెలకొంది.

### ఎమ్మెల్యే మురళీనాయక్ ఎదుట నిరసన..

మానుకోట జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికే నేతల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. తాజాగా ఇందిరమ్మ కమిటీల ఎంపిక కార్యకర్తల మధ్య చిచ్చుపెట్టింది. ఈనెల 15 బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామ కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య గొడవకు దారితీసింది. తాము సూచించిన వారినే ఇందిరమ్మ కమిటీలో నియమించాలంటూ మండల పరిషత్ కార్యలయం బయట కార్యకర్తలు పంచాయితీకి దిగారు. తాజాగా నెల్లికుదురు మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అందరినీ కలుపుకొని వెళ్లకుండా ఏకపక్షంగా సభ్యులను ఎంపికచేయడం ఏంటని గురువారం మండలకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీనాయక్ ఎదుట మరోవర్గం నాయకులు నిరసన వ్యక్తంచేశారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. నెల్లికుదురు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యేపై బహిరంగంగా ఆరోపణలు చేయడం కలకలంరేపింది. అందరినీ కలుపుకొని వెళ్లాల్సిన ఎమ్మెల్యే .. కీలుబొమ్మగా మారారని, ఇలా వ్యవహరిస్తే భవిష్యత్‌లో పార్టీకే నష్టం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## స్టేషన్ ఘన్ పూర్ లో నిరసనలు.. ఆందోళనలు

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్‌లోనూ అంతర్గత పోరు రగులుతూనే ఉంది. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై పాతకాపు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహంగా ఉన్నారు. మొదటి నుంచి కడియం కాంగ్రెస్ చేరికను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ నాయకులు సందర్భం వచ్చిన ప్రతిసారి ఆయనకు వ్యతిరేకంగా పావులు కదుపుతూనే ఉన్నారు. తాజాగా పార్టీలో, ప్రభుత్వ పదవుల్లో మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి కాకుండా.. కడియం వర్గీయులకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తూ స్థానిక కాంగ్రెస్ నేత సింగాపురం ఇందిర మద్దతుదారులు ధర్నాకు దిగారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద జాతీయ రహదారిపై నిరసనలు చేపట్టారు. తాజాగా జఫర్‌గఢ్‌లోనూ కాంగ్రెస్‌లోని ఓ వర్గం నేతలు ఆందోళన చేపట్టడం గమనార్హం. ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దొడ్డిదారిన ఇందిరమ్మ కమిటీలు వేస్తున్నారని, పాతవారిని కాదని కొత్తగా చేరిన వారికి అవకాశం ఇస్తున్నారని మాజీ జెడ్పీటీసీ సదయ్యగౌడ్ మండిపడ్డారు. అదేవిధంగా వేలేరు మండల కేంద్రంలోని రెడ్డి కమ్యూనిటీ భవనంలో కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందిరమ్మ కమిటీల్లో అందరికీ అవకాశం కల్పించాలని కోరారు. పంట చేతికందే సమయంలో పందులు వచ్చి పంట మేసినట్టు ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీలో అసంతృప్త జ్వాలలు చెలరేగుతుండటంతో పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు.

# సారొచ్చారు

- కాకతీయ విశ్వవిద్యాలయం
- వైస్ ఛాన్స్ లర్ గా ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి
- తొమ్మిది యూనివర్సిటీలకు వీసీల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలోని తొమ్మిది యూనివర్సిటీలకు ప్రభుత్వం వైస్ ఛాన్సలర్‌లను నియమించింది. వీసీల నియామకం ఫైళ్లపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకాలు చేశారు. దీంతో వీసీలను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి నియమితులయ్యారు. అదేవిధంగా ఉస్మానియా యూవర్సిటీ వీసీగా ఎం.కుమార్, శాతవాహన వర్సిటీ వీసీగా ఉమేష్‌కుమార్, తెలుగు వర్సిటీ వీసీగా నిత్యానందరావు, మహాత్మాగాంధీ వర్సిటీ వీసీగా అల్తాఫ్ హుస్సేన్, తెలంగాణ వర్సిటీ వీసీగా యాదగిరిరావు, వ్యవసాయ వర్సిటీ వీసీగా అల్దాస్ జానయ్య, ఉద్యానవన వర్సిటీ వీసీగా రాజిరెడ్డి, పాలమూరు వర్సిటీ వీసీగా జీఎన్ శ్రీనివాస్ నియమితులయ్యారు.

### గాడి తప్పిన పాలన..

కాగా.. తెలంగాణలో చాలా కాలంగా వీసీల పోస్టులు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే. దాదాపు ఏడాదిన్నర కాలంగా వీసీలు లేకుండా పోయారు. అంతేకాదు ఇన్‌చార్జ్ వీసీలుగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించినప్పటికీ వర్సిటీలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. వీసీలు లేక అనేక యూనివర్సిటీల్లో పాలన గాడి తప్పినట్లైంది. పలు వర్సిటీల్లో అక్రమాలు జరిగాయని కూడా ఆరోపణలు వచ్చాయి. సరైన వసతులు లేక అనేకసార్లు విద్యార్థులు ఆందోళనబాట పట్టిన విషయం తెలిసిందే. తమ సమస్యలు పరిష్కరించాలని కొత్త వీసీలను నియమించాలని విద్యార్థులు పట్టుబట్టినప్పటికీ ఫలితంలేకుండా పోయింది. ఎట్టకేలకు వీసీల నియామకంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త వీసీల ఆధ్వర్యంలో యూనివర్సిటీల్లో పరిస్థితి ఎలా ఉండబోతుందో చూడాలి మరి.

విజేతలకు బహుమతి అందజేస్తున్న రంజిత్ రెడ్డి

# క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

**పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి**

అక్షర దర్బార్, నెక్కొండ : యువత క్రీడలతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నెక్కొండ మండలంలోని గొట్లకొండ గ్రామంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్ బహూకరించారు. కార్యక్రమంలో నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ మండల కాంగ్రెస్ నాయకులు కుసుమ చెన్నకేశవులు, చల్లా శ్రీపాల్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి కున్సోత్ నైజాం పోలిశెట్టి భాను ప్రకాష్ ఎడ్ల వెంకన్న కున్సోత్ శంకర్ గొట్లకొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్య జనార్దన్ మాలో శివలాల్ శ్రీ సంత సేవాలాల్ మహారాజ్ యూత్ అధ్యక్షుడు గుగులోత్ వెంకన్న ఉపాధ్యక్షుడు దారం సోప్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏనుమాములలో బస్తీ దవాఖాన

**- ఎమ్మెల్యే కృషి పట్ల మహేష్ హర్షం**

అక్షరదర్బార్, ఏనుమాములు: గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఏనుమాములలో పేద ప్రజల కోసం బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రభుత్వానికి ప్రతిపాదన చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మాజీ రాష్ట్ర కోఆర్డినేటర్ అడప మహేష్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ పేద ప్రజలు ఎక్కువగా ఉన్న ఏనుమాముల ప్రాంతంలో బస్తీ దవాఖాన నెలకొల్పాలని, ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ కు సూచించినట్లు తెలిపారు. వైద్యం అందక ఏనుమాముల ప్రాంత పేదలు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఎమ్మెల్యే నాగరాజు బస్తీ దవాఖాన ఏర్పాటు కోసం కృషి చేస్తుండటం పట్ల మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# 'మంథని' రోడ్లకు మహర్దశ

**గ్రామీణ రోడ్లకు రూ.25 కోట్ల కేటాయింపు**

**మంత్రి శ్రీధర్ బాబు చొరవపై ప్రశంసలు**

అక్షర దర్బార్,కాటారం : మంథని నియోజకవర్గంలోని మంథని, కమాన్ పూర్, కాటారం మండలాల్లోని గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కృషితో మంథని నియోజకవర్గంలోని ఆయా మండలాల గ్రామీణ రోడ్లకు రూ.25 కోట్ల నిధులను మంజూరు చేయించారు.ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రభుత్వం నుండి జీవో జారీ చేశారు.మంథని మండలంలో రూ.7 కోట్లతో ఖానాపూర్ నుండి ఎల్ మదుగు వరకు, రూ.4 కోట్లతో కమాన్ పూర్ మండలంలోని కమాన్ పూర్ నుండి పెంచికల్ వరకు, రూ. 3 కోట్ల 5 లక్షలచే రాజాపూర్ నుండి మంగపేట వరకు నిధులు కేటాయించి పనులు చేపట్టనున్నారు.

**తీరనున్న రోడ్డు కష్టాలు**

గత కొన్నేళ్లు గా ఉన్న కాటారం మండలంలోని ఆదివారం పేట నుండి దామెరకుంట వరకు అతుకుల రోడ్డు కష్టాలు ఇక తీరనున్నాయి.ఇటీవల కురిసిన అధిక వర్షాపాతం వాకరణంగా రోడ్డు కోతలకు గురవ్వగా ఆ మార్గం వైపు సరియైన రోడ్డు లేకపోవడంతో ఎంతో మంది కష్టాలు పడుతుండగా యాక్సిడెంట్లో ప్రాణాలు పోయిన సంఘటనలు సైతం లేకపోలేదు.ఈ క్రమంలో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు కృషితో కాటారం మండలానాకి అత్యధిక నిధులు కేటాయించి రోడ్లకు నూతన వైభవం తీసుకువస్తుండగా ప్రజల కష్టాలు ఇక తీరినట్లేనని భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో కాటారం మండలంలో రూ.3 కోట్లతో ఒడిపిలవంచ నుండి గూడురు వరకు ,రూ.2కోట్లతో గుండ్రాత్ పల్లి నుండి ఊట్లపల్లి పోచమ్మ టెంపుల్ వరకు, రూ.2కోట్లతో దామెరకుంట నుండి మానేరు(ఆరెంద) వరకు, రూ.3 కోట్ల 95 లక్షలతో ధన్వాడ గ్రామం నుండి వయా బూడిదపల్లి వరకు రోడ్డును నిర్మించనున్నారు.

**మంత్రి శ్రీధర్ బాబు చొరవపై హర్షం**

కాటారం మండలంలో గత కొన్నేళ్ల నిరీక్షణగా ఉన్న గ్రామీణ రోడ్ల సమస్యలపై ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టితో నిధులు కేటాయింపచేయడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.గతకుల రోడ్డుగా ఉన్న ఆయా గ్రామాల రోడ్లకు మహర్దశ కలగనుండడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.పల్లెవాసులు పడుతున్న రోడ్డు కష్టాలను తెలుసుకుని వెంటనే నిధులు కేటాయింపచేసిన ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక మా ప్రయాణ మార్గం సులభతరం కానుందని శ్రీధర్ బాబు కు రుణపడి ఉంటామని గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# ఆర్టిజన్ కన్వర్షన్ సమస్య పరిష్కరించాలి

**విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ కన్వర్షన్ సాధన కమిటీ చైర్మన్ తిప్పారపు రాజు**

అక్షర దర్బార్, భూపాలపల్లి: విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ కన్వర్షన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ తిప్పారపు రాజు కన్వీనర్ మోత్కూరి కోటి ఆధ్వర్యంలో శుక్రవారం భూపాలపల్లి జిల్లా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ను కలిసి ఆర్టిజన్ కన్వర్షన్ పై వినతి పత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆర్టిజన్ కన్వర్షన్ సమస్యపై ఎమ్మెల్యే రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి కి పై విషయం చెప్పి కన్వర్షన్ అయ్యేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కు ఆర్టిజన్స్ జేఏసీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ యాల్ల సురేందర్ రెడ్డి ఎండి అంకుషావలి కోకన్వీనర్ కోసరి భాస్కరు సట్ల రాజేందర్ మద్దెల కృష్ణమూర్తి పాల్గొన్నారు

ఎమ్మెల్యే గండ్ర సత్యానారాయణ రావుకు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

అక్షర దర్బార్,భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరునగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని భూపాలపల్లి పట్టణ, రూరల్ మండలంతో పాటు గణపురం మండలానికి చెందిన మొత్తం 52 మంది లబ్దిదారులకు రూ.36 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు.

# పెట్రోల్ పోసుకొని ఒంటికి నిప్పు..

- **పాలకుర్తి ఠాణాలో యువకుడి ఆత్మహత్యాయత్నం**
- **కాపాడబోయిన ఎస్సై, కానిస్టేబుల్ కు గాయాలు**

అక్షరదర్బార్, పాలకుర్తి : పోలీస్ స్టేషన్లో ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ స్టేషన్లో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పాలకుర్తి మండలం కొండాపురం గ్రామ శివారు మేకల తండాకు చెందిన లకావత్ శ్రీను, రాధిక దంపతులకు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే శ్రీను ఇటీవల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అయితే తన కేసును పోలీసులు పట్టించుకోవడంలేదని మనస్థాపంతో ఇవ్వాళ ఠాణాకు వచ్చాడు. హఠాత్తుగా ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. శ్రీనును కాపాడబోయిన ఎస్సై సాయి ప్రసన్న కుమార్, కానిస్టేబుల్ రవీందెదర్‌కు గాయాల య్యాయి. బాధితుడిని దవాఖానకు తరలించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

# వ్యభిచార ముఠా గుట్టురట్టు

అక్షరదర్బార్, హన్మకొండ: హన్మకొండ సుబేదారి రెవెన్యూ కాలనీలో ఒక ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళతోపాటు విటులను టాస్క్ ఫోర్స్, సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. హనుమకొండ జిల్లాకు చెందిన మహిళ ఇల్లు కిరాయికి తీసుకొని ఇతర రాష్ట్రాల నుండి మహిళలను రప్పించి సంవత్సరం నుండి రహస్యంగా వ్యభిచారం చేయిస్తోంది. ఈక్రమంలోనే శుక్రవారం రంగశాయిపేటకు చెందిన తడక అరుణ్, జక్కుల అరవింద్‌కు ఇద్దరు మహిళలతో ఒప్పందం కుదర్చగా, వారు వ్యభిచారం చేస్తుండగా పోలీసులు దాడిచేసి వరంగల్‌కు చెందిన నిర్వాహకురాలు బాణాసి స్వర్ణలతను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఎవరైనా ఆర్గనైజ్ గా ఏర్పడి మహిళలతో వ్యభిచారం చేయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే వృత్తిగా చేసుకొని వ్యభిచారం చేస్తూ పదేపదే దొరికితే నిర్వాహకులపై పీడి యాక్ట్ నమోదుచేస్తామని హెచ్చరించారు. హైటెక్ వ్యభిచార ముఠా గుట్టు రట్టు చేసిన ఇన్ స్పెక్టర్ సార్ల రాజు, ఆర్ ఎస్సై భాను ప్రకాష్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

# ప్రజా ప్రభుత్వంలో గురుకులాలకు పెద్ద పీట

**పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**

అక్షర దర్బార్, తొర్రూరు: ప్రజా ప్రభుత్వంలో గురుకులాలకే పెద్దపీట వేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల & కళాశాల, మరియు మైనారిటీ సంక్షేమ వసతి గృహాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్లోని తరగతి గదుల నిర్వహణ, త్రాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాఠశాలలోని సదుపాయాలు, చెత్త, మరుగుదొడ్ల, నిర్వహణ, సిజనల్ జ్వరాలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచించారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, విద్యార్థుల సమస్యలపై సంబంధిత అధికారులను మందలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ చంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్ మరియు ముఖ్య నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్లో వంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

నివాళులర్పిస్తున్న మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ

## ఎంబాడి రవీందర్ కన్నుమూత

- అనారోగ్యంతో తుదిశ్వాస..
- కాంగ్రెస్ తోపాటు పలు పార్టీల నేతలు, ప్రజాప్రతినిధుల నివాళి
- కుటుంబ సభ్యులకు పరామర్శ

అక్షరదర్బార్, వరంగల్ : కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కాంగ్రెస్‌తోపాటు పలు పార్టీల నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు వరంగల్ పెరుకవాడలోని నివాసంలో పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు దంపతులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు నివాళులర్పించారు.

## లైన్ క్లియర్

- రైల్వే బైపాస్ లైన్‌కు నోటిఫికేషన్ జారీ..
- నష్కల్ - హసన్‌పర్తి రైల్వే ట్రాక్ ఏర్పాటులో కీలక ముందడుగు
- భూసేకరణకు సంబంధించి అంచనాలు రూపొందించాలంటూ
- రెవెన్యూ అధికారులకు ఆదేశాలు
- 24.5.5 కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నాలు




అక్షరదర్బార్, హన్మకొండ : నష్కల్ – హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ ఏర్పాటుకు మరో కీలక ముందడుగు పడింది. జనగామ జిల్లా చిల్పూర్ మండలం నష్కల్ రైల్వే స్టేషన్ నుంచి కరుణాపురం, పెద్దపెండ్యల, ఎల్కుర్తి, ధర్మసాగర్, ఉనికిచర్ల, దేవన్నపేట, మడిపల్లి, జయగిరి గ్రామాల మీదుగా హసన్ పర్తి స్టేషన్ వరకు బైపాస్ లైన్‌ను నిర్మించేందుకు దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి కొన్నాళ్లుగా క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలనలు కూడా జరిపారు. గూడ్స్ రైళ్లను ఈ ట్రాక్ నుంచి నడిపిస్తూ.. ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లకు ఇబ్బంది కలగకుండా చూసే లక్ష్యంతో 24.5.5 కి.మీ. మేర ట్రాక్ నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో దక్షిణ మధ్య రైల్వే వేగంగా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ఈనెల 16న ఈ ట్రాక్ నిర్మాణానికి క్షేత్రస్థాయిలో పరిశీలనలు, భూ సేకరణకు సంబంధించి అంచనాలు రూపొందించేందుకు వీలుగా రెవెన్యూ అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈక్రమంలోనే హన్మకొండ ఆర్డీవో, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవోలకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నష్కల్ – హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ ఏర్పాటుకు ఒడిఒడిగా అడుగులు పడుతుండటంతో ఈప్రాంత ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

## మూగ జీవాల అక్రమ రవాణా..

- కారు, డీసీఎం వాహనాలు సీజ్ ..
- ఐదుగురు నిందితులపై కేసు
- వివరాలు వెల్లడించిన ఏటూరునాగారం ఎస్సై తాజుద్దీన్

అక్షరదర్బార్, ఏటూరునాగారం: మీడియా చాటున ఎలాంటి అనుమతులు లేకుండా మూగ జీవాలను అక్రమంగా తరలిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి డీసీఎం, కారును సీజ్ చేసినట్లు ఏటూరునాగారం ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో కారు, డీసీఎం వాహనాలను ఆపి తనిఖీ చేయగా అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఐదుగురు నిందితులు కన్నబోయిన శీను (విలేకరి), ఆత్మూరి రవీందర్, జైస్వాత్ కుమార్, కొడాలి కృష్ణ, ఉచిత శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. 22 మూగ జీవాలను గోశాలకు తరలించి నిందితులపై కేసు నమోదుచేసి వాహనాలను సీజ్ చేశారు. అదేవిధంగా రాత్రుల్లు కొంత మంది వ్యక్తులు అక్రమ సంపాదనకు అలవాటు పడి యూనిఫాం ధరించి ఇసుక లారీల వద్ద నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

మహేష్ గౌడ్ ను సన్మానిస్తున్న విజయగిరి సమ్మయ్య

## టీపీసీసీ చీఫ్ కు సన్మానం

అక్షర దర్బార్, మల్హర్ : టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను శుక్రవారం తెలంగాణ నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఓబీసీ జిల్లా నాయకుడు విజయగిరి సమ్మయ్య నాయీ శుక్రవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లేషన్ అమలు చేస్తూ జీవో 18 విడుదల చేయడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం బీసీ కులగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కోరారు.

## గ్రూప్ 1 అభ్యర్థులకు బిగ్ షాక్..

- మెయిన్స్ పరీక్షకు డివిజన్ బెంచ్ గ్రీన్ సిగ్నల్
- అభ్యర్థుల రిట్ అప్పీల్ కొట్టివేత..
- 21వ తేదీ నుంచి 27 వరకు ఎగ్జామ్స్..
- రాష్ట్రవ్యాప్తంగా 46 పరీక్షా కేంద్రాలు.. 31,383 మంది అభ్యర్థులు

అక్షరదర్బార్, హైదరాబాద్: గ్రూప్ –1 పరీక్ష రాసే అభ్యర్థులకు హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది . గ్రూప్ –1 మెయిన్స్ పరీక్షకు డివిజన్ బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరీక్షలు వాయిదా వేయాలన్న గ్రూప్ – 1 అభ్యర్థుల రిట్ అప్పీల్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసింది. సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించింది. ఈనెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గ్రూప్ – 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 46 పరీక్షలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 31,383 మంది అభ్యర్థులు గ్రూప్ 1 పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఆంక్షలు విధించారు అధికారులు. బీఎన్ఎస్ఎస్ 163 యాక్ట్ ప్రకారం పరీక్షా కేంద్రాల వద్ద ఐదుగురికన్నా ఎక్కువ మంది గుమికూడరాదని హెచ్చరించారు.